భర్తలంతా ఆఫీసులకు పోయాక హాయిగా భోజనాలు చేసి, అరుగు మీద చేరి మీటింగు పెట్టారు అమ్మలక్కలు.

ఆ రోజు వాళ్ళ చర్చలలో ఎవరి భర్తలు ఎంతెంత పనిచేస్తారు. ఎంతెంత విధేయులు అనే విషయాలు ముచ్చటించుకొనడం మొదలు పెట్టారు.

మా ఆయన పొద్దునే లేచి ఇల్లు తుడిచి, వాకిట్లో నీళ్ళుచల్లి, ముగ్గులేస్తారు తెలుసా? అంది సూర్యాకాంతం.

ఆ! అదీ ఓ గొప్పే? గుడ్డి గుర్రం కూడా ఆ పాటి పనిచేస్తుంది. మా ఆయన, వాళ్ళ ఆయన చేసే పనులతో పాటు, కంచాలు, గిన్నెలు కడిగేస్తాడు. నేను లేచేటప్పటికి కాఫీ పెట్టి నాకు తాగించి కాని · తను తాగడు తెలుసా? అంది పంకజం.

వెంటనే సరోజ అందుకుంది. నేను లేచేటప్పటికి మా ఆయన వంట వండి, పిల్లలకు స్నానాలు చేయించి, తను స్నానం చేసి, వాళ్ళ కేరేజీలు సర్ది, తన టిఫిన్‌బాక్సు సర్దుకుని, లైబ్రెరికి వెళ్ళి నాకు పుస్తకాలు తెచ్చి, నా చీరలు, లంగాలు ఉంటే ఉతికి, ఆరేసి అప్పుడు వెడతారు తెలుసా? అంది గర్వంగా చెవికి ఉన్న బుట్టలు ఊగేలా?

# గొప్పలు



మావారు పొద్దున లేచిన దగ్గరనుంచి, రాత్రి పడుకొనే వరకు సమస్తమైన చాకిరీ చేస్తారు. పొద్దున్న భోజనం లోకి వేసే రసం నుంచి, రాత్రి సరసం దాకా అవిశ్రాంతంగా శ్రమిస్తారు. ఎప్పుడైనా ఒంట్లో బాగోపోతే తప్ప. చెప్పింది అనంతలక్ష్మి అలవోకగా నవ్వుతూ.

అన్నీ వింటూ కొత్తగా పెళ్ళయిన అనురాధ నవ్వుతోంది.

ఏమ్మా! మీ వారు ఏం? చేయరా? అడిగారు అమ్మలక్కలు.

ఆ! లేదండి! అనంతలక్ష్మి గారు చెప్పినట్లుగా మావారు కూడా అన్నీ చేస్తారు. కాని... కాని... వాళ్ళాయనకు, మా ఆయనకు కొంచెం తేడా! వారి శ్రీవారు ఒంట్లో బాగోకపోతే ప్రతి పనికి పంగనామం పెట్టేస్తారు.

కాని మావారికి ఒంట్లో బాగోకపోతే పనిమనిషిని పెట్టి చేయిస్తారు! నాకు ఏ పనైనా నాగా ఉంటే నచ్చదని వారికి తెలుసు అంది ముసిముసిగా నవ్వుతూ అనురాధ.

ఆ... ఆడ పనిమనిషా? మగ పనిమనిషా? ఆశ్చర్యంతో... ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచి, చెవులు కొరుక్కున్నారు.

— జి. ఎస్. నరసింహం.

